సాక్షి
నిజామాబాద్
శుక్రవారం। 9। మే। 2025



ఎండలతో జీవాలకు ముప్పు
తీవ్రమైన ఎండలు, వడగాలుల ప్రభావంతో మనుషులతోపాటు మూగ జీవాలు సైతం ఇబ్బందులు పడుతున్నాయి.
- 10లో ▸



మార్పులు, చేర్పులకే..
కొత్త రేషన్ కార్డుల జారీకి చేపట్టిన సర్వే నత్తనడకన సాగుతోంది. పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకే యంత్రాంగం ప్రాధాన్యమిస్తోంది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
40.7 /21.9

వాతావరణం
ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.


చిరుతల మృత్యుఘోష

డెత్‌స్పాట్‌గా మారిన ఇందల్వాయి ఫారెస్ట్

ఉమ్మడి జిల్లాలో అడవుల విస్తీర్ణం (హెక్టార్లలో)

కామారెడ్డి	82,190.48
నిజామాబాద్	86,871.45
ఇందల్వాయి రేంజ్	22,748.41
సిరికొండ రేంజ్	15,544.71

- తాజాగా రోడ్డు ప్రమాదంలో చిరుత మృత్యువాత
- కనిపించని సంరక్షణ చర్యలు
- అండర్‌పాస్‌లు లేక తరచూ ప్రమాదాలు
- కొరవడిన రైల్వే, హైవే, అటవీ అధికారుల సమన్వయం



2018 జనవరిలో రైలు ఢీకొనడంతో సిర్నాపల్లి అటవీ ప్రాంతంలో మృతిచెందిన చిరుత



2019 మేలో రూప్లానాయక్ తండా వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన చిరుత

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ వన్యమృగాలకు డెత్ స్పాట్‌గా మారింది. దట్టమైన అటవీ ప్రాంతంలో మూగజీవాల రక్షణకు ఫారెస్ట్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా సాసర్ పిట్ల నిర్వహణ, వాటి ఏర్పాటులో అలసత్వం వన్యమృగాల పాలిట శాపంగా మారింది. దీనికితోడు అటవీ ప్రాంతంలో రైల్వేశాఖ, జాతీయ రహదారుల విభాగం అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో వన్యప్రాణులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. తాజాగా ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి శివారు 44వ నెంబర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండేళ్ల వయస్సుగల చిరుత మృత్యువాత పడింది. ఈఘటనతో హైవేలు, రైల్వేట్రాక్‌ల వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు ఇందల్వాయి రేంజ్ సదాశివనగర్, సిరికొండ రేంజ్‌కు మాచారెడ్డి మండలాలను కలుపుతూ అడవులున్నాయి. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారి, సికింద్రాబాద్ నుంచి ముంబయి వెళ్లే రైల్వే ట్రాక్ ఈ అటవీ ప్రాంతం గుండా వెళ్తుంది. వేసవిలో అటవీ ప్రాంతంలో తాగునీటి కొరత ఏర్పడుతుంది. వాగులు, వంకలు, చెలిమెలు ఎండిపోతాయి. తద్వారా వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి బయటికి వస్తుంటాయి. నీటి కోసం వెతుకుతూ హైవేలు, రైల్వేట్రాక్‌లు దాటుతుంటాయి. ఈ క్రమంలో రాత్రివేళల్లో చిరుతలు సహా ఇతర వన్యప్రాణులు, మృగాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. కొన్నిసార్లు మృతి చెందుతున్నాయి.

- 2018 జనవరిలో రైలు ఢీకొనడంతో సిర్నాపల్లి అటవీ ప్రాంతంలో చిరుత మృతి.
- 2019 మేలో రూప్లానాయక్ తండా వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో చిరుత మృతి.
- 2023 ఫిబ్రవరిలో చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన చిరుత.
- తాజాగా 2025 మే 7న చంద్రాయన్‌పల్లి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృత్యువాత.



2023 ఫిబ్రవరిలో చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన చిరుత

రేంజ్ వారీగా చిరుతలు

ఆర్మూర్	03
ఇందల్‌వాయి	30
సిరికొండ	14
నిజామాబాద్ నార్త్	15
నిజామాబాద్ సౌత్	10
కమ్మర్‌పల్లి	08
వర్ని	06

నేషనల్ హైవే అధికారులను సంప్రదిస్తున్నాం..

ఇందల్వాయి, సదాశివనగర్ మధ్యలోగల నేషనల్ హైవే రహదారిపై చిరుతలు, ఇతర వన్య ప్రాణులు ప్రమాదాలకు ఎక్కువగా గురై మరణిస్తున్న విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రహదారికి ఇరువైపులా ఫెన్సింగ్ వేయాలని, అలాగే రహదారి కింద అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరాం. ఇలా చేస్తే వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు ఉండదని వివరించాం. నేషనల్ హైవే అథారిటీ సానుకూలంగా స్పందించారు.

– వికాస్ మీనా, జిల్లా అటవీశాఖ అధికారి

శాఖల మధ్య సమన్వయ లోపం..

అటవీ ప్రాంతంలో వన్యమృగాల సంరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తద్వారా మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీటి సంరక్షణ కోసం అటవీశాఖ, రైల్వేశాఖ, జాతీయరహదారుల విభాగం సమన్వయంతో చర్యలు చేపట్టాల్సి ఉంది. వీరి మధ్య సమన్వయ లోపం కారణంగా పనులు కార్యరూపం దాల్చడంలేదు. ముఖ్యంగా రైల్వేట్రాక్, జాతీయ రహదారులకు అండర్ పాస్‌ల నిర్మాణం చేపడితే ఈ ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది. కాగా ఈ విషయమై హైవే ఈఈ మల్లారెడ్డిని వివరణ కోరగా స్పందించలేదు.

వచ్చే నెల 14న జాతీయ లోక్‌అదాలత్

- జీమా కంపెనీలు, న్యాయవాదులు సహకరించాలి
- జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జీవీఎస్ భరతలక్ష్మి

ఖలీల్‌వాడి: జిల్లా వ్యాప్తంగా జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ జీవీఎన్ భరతలక్ష్మి కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో అదనపు జిల్లా జడ్జి హరీష, న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావులతో కలిసి గురువారం బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్స్, అధికారులు, న్యాయవాదులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ యాక్సిడెంట్ కేసులలో నష్టపరిహారంపై బీమా కంపెనీలు, న్యాయవాదులు పరిష్కారించుకోవాలని, అందుకు సహాయ సహకారం అందిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపద్ధతిన అవార్డులు అందుకున్న దావాలలో బీమా కంపెనీల ద్వారా త్వరితగతిన నష్టపరిహార డబ్బులను కోర్టులో డిపాజిట్ చేయిస్తామని తెలిపారు. బాధితులకు చేరితే వారి ఆర్థిక అవసరాలకు పనికొస్తుందన్నారు. సమావేశంలో ప్రభుత్వ బీమా కంపెనీల న్యాయవాదులు గోవర్ధన్, ఆనంద్ రెడ్డి, అంకిత, గణేశ్ దేశ్‌పాండే, ఎంవీ నరసింహారావు, వీ భాస్కర్, ఆర్ మోహన్, సదానంద్ గౌడ్, న్యాయవాదులు రఘువీర్ భూపాల్, రవీందర్, మహేశ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ లాలూ వంకదోత్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన తొమ్మిది నెలలకే..

- నక్సల్స్ చేతిలో బలైన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్
- పాల్వంచ మండల కేంద్రంలో విషాదం



వడ్ల శ్రీధర్ (ఫైల్)

మాచారెడ్డి : కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రేహౌండ్స్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ (30) ములుగు జిల్లా పేరూరు పోలీసు స్టేషన్ పరిధి వాజేడు ఏరియాలో గురువారం ఉదయం నక్సలైట్లుమందుపాతర పేల్చడంతో ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డిలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత 2020లో టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే ఏడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అక్కడే శిక్షణ పూర్తి చేసుకున్న శ్రీధర్ రెండేళ్ల కిందట గ్రేహౌండ్స్ విభాగంలోకి వెళ్లాడు. హైదరాబాద్ కేంద్రంగా గ్రేహౌండ్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. తల్లి లక్ష్మి, భార్య శ్రీవాణితో కలిసి అక్కడే ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. నక్సల్స్ ఏరివేతలో భాగంగా కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ చేపట్టాయి. గ్రేహౌండ్స్ బృందంతో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సల్స్ మందుపాతర పేల్చడంతో శ్రీధర్ మృతిచెందినట్టు పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. కాగా శ్రీధర్‌కు 2024 ఆగస్టు 22న వివాహమైంది. ఏడాది గడవకముందే శ్రీధర్ ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు కంటతడిపెట్టారు. శ్రీధర్ తండ్రి గంగారాం కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. పోలీసులు అందించిన సమాచారంతో శ్రీధర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వరంగల్‌కు తరలివెళ్లారు. అక్కడ పోలీసు అధికారులు శ్రీధర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహం రాత్రి వరకు పాల్వంచకు చేరుకుంది.

ఏదీ.. వ్యవసాయ యాంత్రీకరణ!



- విధి విధానాలు లేక ముందుకు సాగని పథకం
- జిల్లాకు రూ.117.84 లక్షలు మంజూరు
- నెల రోజులైనా పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక

ఇందల్వాయి(నిజామాబాద్ రూరల్): సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం జాడ తెలియడం లేదు. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచి అన్నదాతలకు కూలీల ఖర్చు భారాన్ని, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మార్చి చివరి వారంలో ప్రారంభించిన ఈ పథకానికి సరైన విధి విధానాలు లేక ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం మహిళా రైతులకు పెద్దపీట వేస్తూ సాగుకు ఉపయోగపడే యంత్రాలను రాయితీపై అందజేసేందుకు మార్చి నెలాఖరుకల్లా దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే సంబంధిత శాఖ అధికారులు ఈ పథకంపై సరైన ప్రచారం చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిరుపయోగంగా బడ్జెట్

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు అత్యధికంగా 534 పరికరాలు అందించేందుకు రూ.117.84 లక్షలు బడ్జెట్ కేటాయించింది. పథకంపై ప్రచారం, అవగాహన లేకపోవడంతో చాలా మంది ఆశావహులు, అర్హులు దరఖాస్తులు చేసుకోలేదు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 50 పైగా మాత్రమే దరఖాస్తులు రావడాన్ని చూస్తే రైతులకు ఈ పథకంపై ఎంతమేరకు అవగాహన కల్పించారో తెలుస్తోంది. మరోవైపు ఈ పథకాన్ని ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో ప్రకటించడంతో గత ఆర్థిక సంవత్సర నిధులు ఈ సంవత్సరానికి క్యారీ ఓవర్ కావట్లేదని అధికారులు చెబుతున్నారు. సాంకేతిక కారణాలతో వచ్చిన దరఖాస్తులు కూడా ఆన్‌లైన్ కావట్లేదని, నిధులు క్యారీ ఓవర్ పూర్తయి ఆన్‌లైన్ ప్రక్రియ సజావుగా సాగితేనే లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాన్ని అమలు చేసేందుకు వీలవుతుందని చెబుతున్నారు. మొత్తం మీద ఈ పథకం అమలుపై స్తబ్దత నెలకొందని సంబంధిత శాఖ అధికారులు చెప్పడం విశేషం.

పథకాన్ని ప్రారంభించాలి



ముందస్తు ప్రణాళిక లేకుండా ఆగమేఘాల మీద పథకాన్ని ప్రారంభించి నిలిపివేయడం సరికాదు. ఇకనైనా పథకాన్ని ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా అమలు చేయాలి.

– అంబర్‌సింగ్, మెగ్యానాయక్ తండా

అనర్హులకు అందించొద్దు



జిల్లాలో వేల సంఖ్యలో మహిళా రైతులు ఉన్నారు. యాంత్రీకరణ కోసం కేవలం రూ.117 లక్షలు మాత్రమే కేటాయించడం సరికాదు. అర్హులైన పేద, మధ్య తరగతి మహిళా రైతులందరికీ లబ్ధిచేకూర్చాలి. అనర్హులకు వర్తించకుండా చూడాలి.

– కుంట మోహన్ రెడ్డి, గన్నారం

ఎలాంటి స్పష్టత లేదు

యాంత్రీకరణ పథకం అమలుపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50 పైగా దరఖాస్తులు వచ్చాయి. స్వీకరించిన దరఖాస్తులు ఆన్‌లైన్ కాలేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు పథకం అమలుపై ముందుకు వెళ్లలేం. ఆదేశాలు రాగానే దరఖాస్తులు స్వీకరించి అర్హులైన మహిళా రైతులకు యంత్ర పరికరాలు అందిస్తాం.

– వీరస్వామి, ఇన్‌చార్జి డీఏవో, నిజామాబాద్

వైద్యారోగ్యశాఖలో సెలవులు రద్దు

జీజీహెచ్‌తోపాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదేశాలు

నిజామాబాద్‌నాగారం: దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎమర్జెన్సీ కార్యాలయాల్లో సెలవులు రద్దు చేశారు. జిల్లాలో వైద్యారోగ్యశాఖ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులు, జీజీహెచ్ తదితర అన్ని ఆస్పత్రుల్లో సెలవులు రద్దు చేస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో బోధన్ జిల్లా ఆస్పత్రి, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి, 225 సబ్ సెంటర్లు, 27 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, ఏడు సీహెచ్‌సీలున్నాయి. వీటి పరిధిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బందికి సెలవులు రద్దయ్యాయి. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో వైద్యులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండి సేవలందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో బల్దియాకు రూ.34.70 కోట్లు

- మొత్తం 33,793 దరఖాస్తులు
- 5,372 మందికి ప్రొసీడింగ్స్



నిజామాబాద్ సిటీ: లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)తో ప్రభుత్వానికి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.34.70 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం 33,793 దరఖాస్తులు రాగా అందులో 9,258 మంది ఫీజును చెల్లించారు. ఎల్ఆర్ఎస్ ద్వారా జీహెచ్ఎంసీ మినహా ఇతర మున్సిపాలిటీల్లో నిజామాబాద్ 8వ స్థానంలో నిలిచింది.

రెండుసార్లు గడువు పొడిగింపు..

నాన్ లేఅవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం 2016లో ఎల్ఆర్ఎస్ స్కీంను ప్రవేశపెట్టింది. కాగా, ప్రస్తుత ప్రభుత్వం సైతం స్కీంను ప్రవేశపెట్టి రెండు సార్లు గడువు పొడిగించింది. మొదట మార్చి 31 వరకు ఫీజుల చెల్లింపునకు అవకాశమివ్వగా, చివరగా ఈ నెల 3వరకు గడువిచ్చింది. కార్పొరేషన్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు మొత్తం 33,793 మంది దరఖాస్తు చేసుకోగా, 9,258 మంది ఫీజును చెల్లించారు. వారిలో 5,372 మంది దరఖాస్తులు పరిశీలించి సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇంకా 3,886 మందికి చెందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

తిరస్కరణకు కారణాలివే..

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరివి తిరస్కరణకు గురయ్యాయి. సరైన డాక్యుమెంట్లు లేకపోవడం, ప్లాట్ నాలాలు, మోరీల పక్కనే ఉండటం, ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు ఉండటం, కోర్టు కేసుల్లో ఉన్న భూములు, మాస్టర్ ప్లాన్‌లోకి వచ్చే భూములు, పార్కు స్థలాలు, సరైన ఫీజు చెల్లించని వారి దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు అధికారులు తెలిపారు.

గడువు ముగిసినట్లే



ఎల్ఆర్ఎస్ స్కీం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెల 3తో ముగిసింది. సమయం పొడిగించారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అన్ని ధ్రువీకరణ పత్రాలున్న వారికి ప్రొసీడింగ్స్ ఇచ్చాం. కొంతమందివి పెండింగ్‌లో ఉన్నాయి. సరైన పత్రాలు లేని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటికి అనుమతివ్వలేదు.

– తేరాల శ్రీనివాస్, అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి

తప్పుల్లేకుండా నమోదు చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- రెవెన్యూ సదస్సుల పరిశీలన

బాల్కొండ: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమర్పించిన దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మెండోరా మండలం దూదిగాం, సోన్‌పేట్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులను గురువారం ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒకే దరఖాస్తుపై రెండు, మూడు సమస్యలకు అర్జీ పెట్టుకోవచ్చని రైతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం మెండోరా మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఆ మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, మెండోరా, బాల్కొండ తహసీల్దార్లు సంతోష్‌రెడ్డి, శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.



దూదిగాంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

న్యూస్‌రీల్

ముగిసిన యూనిసెఫ్ బృందం క్షేత్ర పర్యటన



నిజామాబాద్ నాగారం: జిల్లాలో యూనిసెఫ్ బృందం పర్యటన ముగిసింది. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయాన్ని గురువారం సందర్శించి పలు విషయాలపై చర్చించారు. యూనిసెఫ్ బృందం సభ్యులు న్యూట్రిషన్ స్పెషలిస్టు డాక్టర్ ఖ్యాతి తివారి, న్యూట్రిషన్ ఆఫీసర్ రేషా నికుంజ దేశాయి, నరసింహారావులు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారం రాథోడ్‌తో సమీక్షించారు. మొదటిరోజు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తిర్మన్‌పల్లి, గన్నారం గ్రామాల్లో పర్యటించి పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు అందించే సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాల పనితీరును మెచ్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వచ్చే నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు సామ్ మామ్ చిల్డ్రన్స్‌కు అందించే స్పెషల్ సప్లమెంటరీ ఫీడింగ్‌పై శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరింటెండెంట్ ఇందిరా, న్యూట్రిషన్ విభాగం అధికారి రాంబాబు హాజరయ్యారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బోధన్‌టౌన్(బోధన్): నిర్దేశిత మెనూ ప్రకారం రోగులకు భోజనాన్ని అందించాలని జిల్లా డైట్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు సూచించారు. బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జిల్లా డైట్ టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం భోజనాన్ని తనిఖీ చేసింది. వంట గదితోపాటు కూరగాయలను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చి అడ్మిట్ ఉన్న రోగులకు అందిస్తున్న భోజన మెనూ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల వద్దకు వెళ్లి నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని వాకబు చేశారు. తనిఖీల్లో డాక్టర్ వెంకటేశ్, ప్రోగ్రాం అధికారి నారాయణ, సిబ్బంది ఉన్నారు.

బ్యాంకు లింకేజీలో జిల్లాకు ఉత్తమ అవార్డు

- మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్న డీఆర్డీవో



డొంకేశ్వర్(ఆర్మూర్): మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందజేసినందుకు నిజామాబాద్ జిల్లాకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన నూతన వార్షిక ప్రణాళిక ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్డీవో సాయాగౌడ్ అవార్డును అందుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.1228.71 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం ఉండగా, ఇప్పటి వరకు 16,060 మహిళా సంఘాలకు రూ.1320.73 కోట్ల రుణాలను (107.49 శాతం) అందించారు. డీపీఎం నీలిమాకు ఉత్తమ ఎంప్లాయీ అవార్డు కూడా వచ్చింది.

రూ.30వేలకు చేరువలో ఆమ్‌చూర్



సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆమ్‌చూర్ ధర అమాంతం పెరిగి రూ.30 వేలకు చేరుకుంది. గురువారం క్వింటాలుకు రూ.29,500 పలికి ఈ సీజన్‌లో అత్యధిక ధరగా నమోదైంది. బుధవారం వరకు రూ.25 వేలకు దిగువన పలికిన ఆమ్‌చూర్ ఏకంగా రూ.5వేలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డుకు గురువారం 223 క్వింటాళ్ల పంట వచ్చింది. జిల్లాతోపాటు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, ఇతర జిల్లాల నుంచి ఆమ్‌చూర్‌ను శ్రద్ధానంద్ గంజ్‌కు తీసుకొస్తారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా నిజామాబాద్ మార్కెట్ యార్డులోనే ఆమ్‌చూర్ పంట క్రయవిక్రయాలు జరుగుతాయి.

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు

- 'సాక్షి' ఎడిటర్‌ ధనుంజయ్‌రెడ్డిపై ఏపీ ప్రభుత్వం వేధింపులు
- కామారెడ్డిలో జర్నలిస్టుల నిరసన



కామారెడ్డి టౌన్‌: 'సాక్షి' దినపత్రిక ఎడిటర్‌ ధనుంజయ్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం, పోలీసుల వేధింపులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు గురువారం నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టర్‌ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ చందర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్‌ కార్యాలయం ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం వద్ద కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న 'సాక్షి' దినపత్రికపై ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటని సీనియర్‌ జర్నలిస్టులు వేణుగోపాలచారి, రజనీకాంత్‌, శ్రీనివాస్‌ తదితరులు మండిపడ్డారు. సాక్షి ఎడిటర్‌పై దాడి, అక్రమ కేసులు, ఆయన ఇంట్లో సోదాలు ప్రత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టుఅని అన్నారు. కక్షపూరితమైన చర్యలను మానుకోనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులు పట్నం శ్రీనివాస్‌, శ్రీనివాస్‌రెడ్డి, ఆబీద్‌, అర్షద్‌, వెంకటేశ్‌, రాజేశ్‌, రమేశ్‌, సంగరాజు, అన్వర్‌, ప్రభు, సురేశ్‌, కౌసర్‌, హరీశ్‌ పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్‌ ల్యాండ్‌ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ అర్బన్‌: లైసెన్స్‌డ్‌ ల్యాండ్‌ సర్వేయర్ల శిక్షణకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీ సేవా కేంద్రాల్లో ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా సర్వే, ల్యాండ్‌ రికార్డ్స్‌ విభాగంలో అర్హత కలిగిన సర్వేయర్లు సరిపడా సంఖ్యలో లేనందున, 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్స్‌డ్‌ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లైసెన్సు సర్వేయర్‌గా ఎంపికైన వారు నెలకు సుమారు రూ.30 వేలకు పైగా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్‌ సూచించారు. లైసెన్స్‌ సర్వేయర్‌గా ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి లైసెన్స్‌ ఇస్తామన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 17.05.2025 నాటికి ఓసీ, బీసీలు అయితే 18 నుంచి 35 సంవత్సరాల లోపు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు, ఇంటర్‌, డిప్లొమా సివిల్‌ ట్రేడ్‌, వొకేషనల్‌, నిర్దేశిత కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు. శిక్షణ కోసం ఓసీ అభ్యర్థులు రూ. 10 వేలు, బీసీలు రూ. 5 వేలు, ఎస్సీ/ఎస్టీలు రూ. 2,500 రుసుము చెల్లించాలని పేర్కొన్నారు.

నల్ల మట్టి మోతాదు మించొద్దు

- పంట భూమిలో విచ్చలవిడిగ వేస్తున్న అన్నదాతలు
- మోతాదు కంటే ఎక్కువగా వేస్తే తిప్పలు తప్పవంటున్న అధికారులు



సోన్‌పేట్‌లో పంట భూమిలో వేసిన నల్ల మట్టి

బాల్కొండ: భూసారం పెంచడం కోసం రైతులు నల్లమట్టిని విచ్చలవిడిగా పంట భూముల్లో వేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు తగ్గుముఖం పట్టి నల్ల మట్టి వస్తోంది. ప్రధానంగా శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ బ్యాక్‌ వాటర్‌ నిలిచే ప్రాంతం నుంచి అధికంగా నల్లమట్టి లభిస్తుంది. ఈక్రమంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని భావించి రైతులు నల్ల మట్టిని తరలిస్తున్నారు. ఎకరానికి 60 నుంచి 75 టన్నుల నల్ల మట్టిని వేస్తున్నారు. ఒక డంపర్‌ 12వేల ధర పెట్టి ఎకరంలో మూడు డంపర్ల నల్ల మట్టిని వేస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. కానీ ఎక్కువగా నల్ల మట్టి వేయడంతో నేలకు నష్టం కలుగుతుందని బాల్కొండ ఏవో బద్దం లావణ్య హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా పసుపు పంటను సాగు చేసే నేలల్లోనే ఎక్కువగా నల్ల మట్టిని వేస్తున్నారు. నేల రకాలను బట్టి నల్లమట్టి గుణం మారుతుందంటున్నారు.

- నల్ల మట్టి ఎక్కువ వేయడం వలన నేలలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో పసుపు పంటకు దుంపకుళ్లు సోకే ప్రమాదం ఉంటుంది.
- ఎకరానికి 20–25 టన్నులు మాత్రమే నల్ల మట్టి వేసుకోవాలి.
- నల్లమట్టి ఎక్కువ కావడం వలన నేల దిబ్బ పారుతుంది. దీంతో పంట వేర్లు లోపలికి వెళ్లకుండా అడ్డు పడుతుంది.
- నల్ల మట్టి అధికంగా ఉండటంతో కలుపు మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి.
- పొలాల్లో నీటి పారుదల సరిగా ఉండదు. నీరు నిల్వ ఉండటం వల్ల పంట అంతటికి అందకుండా పోతుంది.
- నల్లమట్టి వేసిన నేలల్లో కొన్ని మొక్కలు సరిగ్గా పెరగవు.
- భూమి సారవంతం కూడ తగ్గిపోయే ప్రమాదం ఉంది.
- ప్రధానంగా నల్లమట్టి పత్తి సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇతర పంటలకు అంతగా అనుకూలమైంది కాదు.

ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

కమ్మర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన కాంగ్రెస్‌ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్నప్పుడు ఆర్థికంగా దివాలా చేసి, మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రశాంత్‌రెడ్డి ఎప్పుడు మాట్లాడినా ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప, సలహాలు సూచనలు ఇచ్చింది లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను, ఇతర అన్ని వ్యవస్థలను బీఆర్‌ఎస్‌ నిర్వీర్యం చేసిందన్నారు. దానిని కాంగ్రెస్‌ ప్రభుత్వం సరిచేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. బీఆర్‌ఎస్‌ హయాంలో ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నప్పుడు మంత్రులుగా ఉన్న హరీష్‌రావు, ప్రశాంత్‌రెడ్డి ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. ఆయనకు ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఏ విషయంలో విఫలమైందో చెప్పాలనుకుంటే చర్చకు వేదిక నిర్ణయించి తెలుపాలన్నారు. అందుకు తాము సిద్ధంగా ఉన్నామని మానాల సవాలు విసిరారు. ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణురాజ్‌, కమ్మర్‌పల్లి ఏఎంసీ చైర్మన్‌ పాలెం నర్సయ్య, వైస్‌చైర్మన్‌ భూచయ్య, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు సుంకెట రవి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు గంగాప్రసాద్‌, కిసాన్‌సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్‌, మల్లయ్య, సుంకెట శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ ముఖ్యమైంది



మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్‌ రావు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): సొసైటీలో సహకార సంఘాల వ్యవస్థ, పాత్ర ముఖ్యమైనదిగా మారిందని డీసీవో శ్రీనివాస్‌ రావు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్‌ కోఆపరేటివ్‌ సొసైటీ భవనంలో సమావేశం నిర్వహించారు. డీసీవో ముఖ్య అతిథిగా హాజరై, సహకార చట్టం, పాలనపై సభ్యులకు అవగాహన కల్పించారు. సొసైటీ సభ్యులు శంకర్‌రెడ్డి, దత్తాత్రేయ, ప్రభాకర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, కోటేశ్వర్‌ రావు పాల్గొన్నారు.

మండుటెండలోనూ పచ్చగా పంటపొలాలు



చిన్నయానం వద్ద సాగవుతున్న పచ్చని పొలాలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లా వ్యాప్తంగా వరికోతలు దాదాపు పూర్తయ్యాయి. పంటను అమ్ముకుని రైతులంతా ఖరీఫ్‌ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కానీ డొంకేశ్వర్‌ మండలంలో గోదావరి శివారు ప్రాంతాల్లో కోతకు రాని పొలాలు ఇంకా ఉన్నాయి. ఎస్సారెస్పీ బ్యాక్‌ వాటర్‌ తగ్గడంతో రైతులు ఇటీవల వరిసాగు చేశారు. మండు వేసవిలో కూడా పచ్చదనంతో పొలాలు కళకళలాడుతున్నాయి. పొట్టదశలో ఉన్న వరికి రైతులు కష్టపడి నీటిని అందిస్తున్నారు. మండుటెండల్లోనూ పచ్చని పొలాలను చూసి స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌, పాల్గొన్న ఇంటర్‌ అధికారి రవికుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను భారీగా పెంచడానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని అడిషనల్‌ కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం జిల్లా ఇంటర్‌ విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలు, బడుల్లో అడ్మిషన్లను పెంచడంతోపాటు, రానున్న సప్లమెంటరీ పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. జిల్లా ఇంటర్‌ విద్య అధికారి రవికుమార్‌ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. ఫలితాల సాధనలో 90 రోజుల ప్రణాళికలను అమలు చేశామని అలాగే ప్రస్తుత సప్లిమెంటరీ పరీక్షలకు 15 రోజుల ప్రణాళిక ద్వారా 100 శాతం ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్‌ సౌకర్యం లేదని, మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపినట్లయితే అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వ అనుమతి లేని కళాశాలలో విద్యార్థులను చేర్పించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లావిద్యాశాఖ అధికారి అశోక్‌, ఆర్టీసీ అధికారులు, ఫైర్‌ ఆఫీసర్‌, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్‌ సంబంధిత అధికారులు, జిల్లా ఇంటర్‌ విద్య పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్‌ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జీవాలకు ముప్పు

- పశువులు, గొర్రెలను నీడపట్టున ఉంచాలి
- ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లడం మేలు
- పశు పెంపకందారులకు పశుసంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి రోహిత్‌రెడ్డి సూచన





రోహిత్‌ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): తీవ్రమైన ఎండలతో పాటు వడగాలుల ప్రభావంతో ప్రజలతో పాటు మూగ జీవాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మనుషులకు ఎండదెబ్బ తలుగుతోంది. అలాంటిది బయట మేతకోసం సంచరించే పశువులు, గొర్రెలు, మేకలతో పాటు పక్షులు ఎంత అల్లాడుతున్నాయో చెప్పనక్కర్లేదు. మండుతున్న ఎండల బారినుంచి మూగ జీవాలను ఏ విధంగా కాపాడుకోవాలో గురువారం పశుసంవర్ధక శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రోహిత్‌ రెడ్డి 'సాక్షి'కి వివరించారు.

- గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులను ఎక్కువగా ఎండలో తిప్పకూడదు. వీలైనంత వరకు చల్లని ప్రాంతాల్లో, నీడపట్టున ఉంచాలి. ఇంటి వద్ద రేకుల షెడ్డు ఉన్న వారు పైన వరిగడ్డి ఉంచితే వేడి ప్రభావం తక్కువగా ఉంటుంది. వీలైతే ఫ్యాన్‌లు కూడా పెట్టుకోవాలి.
- మేతను ఎక్కువగా ఇంటి వద్దే అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలి. బయటకు తీసుకెళ్లడం తప్పనిసరైతే, ఉదయం 6 నుంచి 10 గంటల్లోపు తీసుకెళ్లాలి. మళ్లీ సాయంత్రం 5 దాటిన తర్వాత మరోసారి మేతకు తీసుకెళ్లాలి.
- వేసవిలో పశువులు ఎక్కువ మొతాదులో నీటిని తాగుతాయి. వాటికి సరిపడా చల్లని, శుభ్రమైన నీటిని అందించాలి. ఒక్కో గేదె 50 లీటర్ల నీళ్లు తాగేలా చూడాలి. మేత, దానా పచ్చి రూపంలో అందిస్తే బాగుటుంది.
- జంతు ప్రేమికులు వారి ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఎల్లప్పుడు నీడ పట్టున ఉంచి క్రమం తప్పకుండా ఆహారం, నీటిని అందించాలి. పక్షుల కోసం ఇంటి బయట గిన్నెలు, పాత్రల్లో నీటిని పోసి ఉంచాలి.
- ఒకవేళ పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలు ఎండ ప్రభావానికి, ఎండదెబ్బకు గురైతే వాటి శరీరం వేడిగా, పొడిబారి ఉంటుంది. వెంటనే తడిబట్టతో తుడవాలి, లేదా కప్పి ఉంచాలి.
- జీవాల ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే స్థానిక పశు వైద్య అధికారులకు సమాచారం అందించాలి. వారు వెంటనే వచ్చి చికిత్స అందిస్తారు.

భారత సైన్యానికి అభినందనలు



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి

డిచ్‌పల్లి: ఆపరేషన్‌ సిందూర్‌ పేరిట పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపి, ఉగ్రవాదులను హతమార్చిన భారత సైన్యానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి అభినందనలు తెలిపారు. ఈ దాడిని ప్రపంచ దేశాలతోపాటు భారత్‌లోని ముస్లిం మతపెద్దలు సమర్థించడం అభినందనీయమన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులను ఉగ్రవాదులు దారుణంగా చంపారన్నారు. ఈ ఘటనపై ప్రతీకారంగా పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టి భారతదేశ జెండాను, భారతదేశ గౌరవాన్ని ప్రపంచ దేశాల నలుమూలల గర్వించేలా చేశారని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌ లాంటి దేశాలకు ఇది కనువిప్పు కావాలన్నారు. ఏ దేశంలో కూడా ఉగ్రవాదంతో ప్రజల జీవితాలు బాగుపడిన దాఖలాలు లేవన్నారు. భారత సైన్యాన్ని, ప్రధాని మోదీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్‌, బీజేవైం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి, నాయకులు శ్యాంరావు, గంగారెడ్డి, బాలయ్య, లక్ష్మణ్‌, విఠల్‌, పరుశురాం, వినోద్‌, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకే ప్రాధాన్యం

- నత్తనడకన సాగుతున్న కొత్త రేషన్‌ కార్డుల సర్వే
- నూతన కార్డుల జారీకి తీవ్ర జాప్యం



మోర్తాడ్‌(బాల్కొండ): కొత్త రేషన్‌ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వే నత్తనడకన సాగుతుంది. పాత కార్డులలో పేర్లు చేర్చడం, ఏవైనా మార్పులు చేర్పులు చేయడం కోసం వచ్చిన దరఖాస్తులకే ప్రభుత్వ యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తుంది. రేషన్‌కార్డులు పొందడానికి అర్హులై ఉండి ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న వారికి కొంతకాలం ఎదురు చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఎంపిక చేసిన గ్రామాల్లోనే..

రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి కొత్త రేషన్‌ కార్డుల జారీపై ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు. గడచిన గణతంత్ర దినోత్సవం రోజున జిల్లాలో ఎంపిక చేసిన 31 గ్రామాలలోనే కొత్త రేషన్‌ కార్డుల జారీ చేశారు. మిగిలిన గ్రామాలలో కార్డులను జారీ చేయాల్సి ఉండగా సర్వే నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం నిర్దేశించింది. ప్రజాపాలనలోనూ, మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి అధికారులు సర్వే నిర్వహించనున్నారు. రెవెన్యూ విభాగంలోని జూనియర్‌ అసిస్టెంట్‌ క్యాడర్‌ సిబ్బంది నుంచి ఇతర హోదాల ఉద్యోగుల వరకూ ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సర్వేలో తొలి ప్రాధాన్యతగా కార్డులలో అదనపు పేర్లు నమోదు చేయడం తప్పా మరే ఇతర అంశాలను లెక్కలోకి తీసుకోవడం లేదు.

పెండింగ్‌లో 77వేలకు పైగా దరఖాస్తులు

దాదాపు ఎనిమిది సంవత్సరాల నుంచి రేషన్‌ కార్డులలో కుటుంబ సభ్యులను చేర్చడం చేయలేదు. మరణించిన వారి పేర్లు తొలగించినా పుట్టిన వారి పేర్లు చేర్చడం, పెళ్లి చేసుకుని అత్తారింటికి వచ్చిన యువతుల పేర్లు నమోదు చేయడం, ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లిన వారి పేర్లు తొలగించగా వారిని మళ్లి చేర్చడం అసలే జరుగలేదు. అలా పేర్లు నమోదు చేయాలని వచ్చిన దరఖాస్తులు జిల్లా వ్యాప్తంగా 77,758 వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. పౌర సరఫరాల శాఖ వెబ్‌పోర్టల్‌ బ్లాక్‌ చేసి ఉండటంతో ఇంకా అనేక మంది ద రఖాస్తు చేసుకోవాలని ఆసక్తి చూపినా వారికి ఇ టీవలనే పేర్ల నమోదుకు అవకాశం ఏర్పడింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ప రిష్కరించడానికి ఇప్పుడు మార్గం సుమగమైంది.

కొత్త కార్డుల కోసం 80వేలకు పైగా దరఖాస్తులు..

కొత్తగా కార్డులు కావాలని జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో 81,148 కుటుంబాల నుంచి ఆర్జీలు అధికారులకు అందాయి. జనవరి 26న తొలి విడతగా 1066 కుటుంబాలకు కొత్త కార్డులను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. మరో 80వేలకు మించి దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులను జారీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం రేషన్‌ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం, సంక్షేమ పథకాల అమలుకు రేషన్‌ కార్డు ప్రామాణికం కావడంతో కార్డులు లేనివారు భారీగా దరఖాస్తు చేస్తున్నారు. జారీ చేసే కార్డుల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. అనర్హులకు కార్డులు జారీ చేస్తే ఉద్యోగులను ఇంటికి పంపిస్తామని హెచ్చరికలు సైతం జారీ చేశారు. అనర్హులకు కార్డులు జారీ చేయకూడదనే నిబంధన పాటించడం మంచిదే కానీ అర్హులైన వారికి మాత్రం కార్డులను జారీ చేయడంలో జాప్యం వద్దనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

సర్వే కొనసాగుతుంది..

రేషన్‌ కార్డులలో మార్పులు, చేర్పులు, కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సర్వే కొనసాగుతుంది. తొలి విడతగా మార్పులు చేర్పులపై ఉద్యోగులు వివరాలను సేకరిస్తున్నారు. కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన కూడా త్వరలో పూర్తి చేస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదు.

– కృష్ణ, తహసీల్దార్‌, మోర్తాడ్‌

సమ్మెను జయప్రదం చేయండి

నిజామాబాద్‌ సిటీ: కార్మికుల హక్కులను సా ధించేందుకు దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీసీఐ నాయకులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోటగల్లీలోని శ్రామిక్‌ భవన్‌లో స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. వస్తువుల ధరలు పెరిగాయన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వనమాల కృష్ణ, నరేందర్‌, ముస్కె సుధాకర్‌, వెంకన్న, రాజేశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యం

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ము రేవతి తన కొడుకు శ్రేయస్‌తో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. గత నెల 30న రేవతి తన కొడుకుతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటివరకు తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఎంతవెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త జలంధర్‌ పోలీస్‌ స్టేషన్లో గురువారం ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్రైం కార్నర్‌

లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనుల్లో ప్రమాదం: ఒకరి మృతి



వర్ని: వర్ని పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చందూరు మండలం కారేగాం తండా వద్ద కొనసాగుతున్న లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనుల్లో ప్రమాదం జరగడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బీహార్‌ రాష్ట్రానికి చెందిన ఎండి సాజీద్‌ (19) ఉపాధి నిమిత్తం లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనుల్లో చేరాడు. బుధవారం రాత్రి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనుల్లో భాగంగా క్రేన్‌తో పైపులు వేస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్‌ వైరు తెగిపోయి పైపులు కార్మికులపై పడ్డాయి. ఈ ఘటనలో సాజీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బోధన్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు.

ఆస్పత్రిలో బాలింత మృతి



సునంద (ఫైల్‌)

కామారెడ్డి రూరల్‌: మధ్యాహ్నం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి రాత్రికి కన్నుమూసింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన దుమాల సునంద–మల్లేష్‌ దంపతులకు మొదటి కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రెండవ సారి గర్భం దాల్చిన సునంద బుధవారం డెలివరీ కోసం నిజామాబాద్‌ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరింది. మధ్యాహ్నం పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. రాత్రి వరకు కుటుంబ సభ్యులతో బాగానే మాట్లాడిన సునందకు అర్ధరాత్రి దమ్ము ఎక్కువైంది. ఆమెను బతికించేందుకు వైద్యులు శతవిధాల ప్రయత్నించినా ఫలించలేదు. అర గంటలోనే ఆమె మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యింది. బిడ్డను కళ్లారా తనివితీరా చూసుకోకుండానే మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సునంద మృతి చెందడంతో ఆమె కూతురు అక్షమాల, భర్త మల్లేష్‌, పుట్టిన బాలుడి పరిస్థితి ఏమిటోనని గ్రామస్తులు రోధించారు.

పూడ్చిన మృతదేహానికి పంచనామా

నవీపేట: మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో 13రోజుల కిందట పూడ్చిన ఓ వ్యక్తి మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇ లా.. అదే గ్రామానికి చెందిన వ్యక్తి(58) గత నెల 25న మృతి చెందడంతో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి చిన్న కుమారుడు ఈనెల 7న పీఎస్‌కు వచ్చి, తన తండ్రి మరణంపై అనుమానం ఉందని, ఒక వ్యక్తి తీవ్రంగా కొట్టడంతో ఆ దెబ్బలకు చనిపోయాడని ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్‌ వెంకటరమణ, ఎస్సై వినయ్‌ల ఆధ్వర్యంలో గురువారం పూడ్చిన శవాన్ని వెలికితీసి అక్కడే జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వైద్యులు పోస్ట్‌మార్టం చేశారు. వైద్య పరీక్ష ఫలితాలు వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

ప్రయాణికురాలి బంగారం చోరీ

కామారెడ్డి క్రైం: బస్సు ఎక్కుతుండగా హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో గురువారం రాత్రి జరిగింది. సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన శ్రీమంతుల సంధీప్త అనే మహిళ హైదరాబాద్‌ నుంచి స్వగ్రామానికి వస్తూ సాయంత్రం కామారెడ్డి బస్టాండ్‌లో దిగింది. సిరికొండ బస్సు ఎక్కిన తర్వాత హ్యాండ్‌ బ్యాగ్‌ చూసుకోగా బ్యాగ్‌లో ఉన్న ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు. బస్సు ఎక్కే క్రమంలో చోరీ జరిగినట్లు భావిస్తున్నారు. హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్న 8 తులాల బంగారు గొలుసు చోరీకి గురైందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సంజీవ్‌ తెలిపిన వివరాలు ఇలా.. పచ్చలనడ్కుడకు చెందిన ఆర్మూర్‌ రుకుంబాయి ఈనెల 5న ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌కు వెళ్లింది. గురువారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకొని, పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి, బీరువాలోని సుమారు 8 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె, ఆవు మృతి

సిరికొండ: మండలంలోని పాకాల గ్రామంలో బాదావత్‌ శ్రీనివాస్‌కు చెందిన గేదె విద్యుత్‌ షాక్‌తో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమీప పొలాల్లో మేతమేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్‌ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ 50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అలాగే పెద్ద వాల్గోట్‌ శివారులో కృష్ణ మందిరానికి చెందిన ఆవు విద్యుత్‌ షాక్‌తో ఈ నెల 4న మృతి చెందినట్లు ఆలయ ప్రభూజి గురువారం తెలిపారు. పొలాల్లో మేతమేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో ఆవు మృతి చెందినట్లు తెలిపారు. ఆవు విలువ రూ. 70వేల వరకు ఉంటుందని ప్రభూజి తెలిపారు.